TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 50 | మంగళవారం 14-10-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## బీజేపీ బలమైన రాజకీయ ప్రత్యర్థి ఒవైసీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 13: బీజేపీని 'బలమైన రాజకీయ ప్రత్యర్థి' అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఆ పార్టీ, నేతలు కార్యకర్తలు రాత్రింబవళ్లు పని చేస్తారని ప్రశంసించారు. "బీజేపీని ఓడించడం అంత సులువు కాదు. తాను అనుకున్న పనిని రెప్పపాటు కాలంలో చేయగలదు. ప్రతిపక్షాలు బీజేపీని ఎదుర్కొవాలంటే దాని ప్రతి కదలికపై అప్రమత్తంగా ఉండాలి" అని ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. అలాగే, బిహార్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై తమ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ 'ఓట్ చోరి' ఆరోపణలపై.. ఆయన తరపున మాట్లాడలేనని, కానీ బీజేపీలా పోరాట పటిమను చూపకపోతే ఆ పార్టీని ఓడించలేమని ఓవైసీ అన్నారు.

## కరూర్ ఘటనపై సీబీఐ దర్యాప్తు

### రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో పర్యవేక్షణ కమిటీ

### సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు



**చెన్నై, అక్టోబరు 13:** తమిళనాడులోని కరూర్‌లో గత నెల టీవీకే అధినేత విజయ్ సభలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇదే సమయంలో తొక్కిసలాట ఘటనపై మద్రాస్ హైకోర్టు ఐజీ అస్రాగార్గ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'సిట్', తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు వెలువరించింది. కరూర్‌లో గత సెప్టెంబరు 27వ తేదీ రాత్రి తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాట ఘటనలో 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే.

### రాహుల్ ఓటు చోరీ వ్యాఖ్యలపై పిల్‌ను

## తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ఎన్నికల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల పలు సందర్భాల్లో ఆరోపించారు. ఆయన ఆరోపణలపై విచారణకు మాజీ జడ్జి సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ ను ఆశ్రయించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిటిషనర్‌కు సూచించింది. 'పిటిషనర్ తరపు న్యాయవాది వాదన విన్నాం. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం కింద దాఖలైన ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు నిరాకరిస్తున్నాం. కావాలనుకుంటే ఈసీఐను పిటిషనర్ ఆశ్రయించవచ్చు' అని ధర్మాసనం పేర్కొంది. బెంగళూరు సెంట్రల్, ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల జాబితా అవకతవకలపై ఆగస్టు 7న రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఉటంకిస్తూ న్యాయవాది, కాంగ్రెస్ సభ్యుడు రోహిత్ పాండే ఈ పిటిషన్ వేశారు. ఎన్నికల జాబితా సన్నాహకాలు, నిర్వహణ, పబ్లికేషన్ విషయాల్లో ఈసీ పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోర్టును ఆయన కోరారు. అర్ధవంతమైన వెరిఫికేషన్, ఆడిట్, పబ్లిక్ స్క్రూటినీకి వీలుగా మెషీన్-రీడబుల్ ఫార్మెట్‌లో ఎన్నికల జాబితాను పబ్లిష్ చేయాలని కూడా కోరారు. కాగా, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ పదేపదే విమర్శలు గుప్పిస్తూ వచ్చారు. కొందరు పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం చేకూర్చేందుకే ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో ఓట్ల చోరీ విషయంలో బీజేపీ విజయవంతమైందని, అయితే బీహార్‌లో మాత్రం ఓట్ల చోరీ జరగనీయమన్నారు. అయితే, ఈ ఆరోపణలను బీజేపీ నేతలతో పాటు ఎన్నికల కమిషన్ అధికారులు తోసిపుచ్చారు. రాహుల్ తన ఆరోపణలను తగిన ఆధారాలు చూపిస్తూ అఫిడవిట్‌తో ముందుకు రావాలని ఈసీ సూచించింది.



## విద్యార్థులు, ఉద్యోగులకు బయోమెట్రిక్

### ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్

**హైదరాబాద్, అక్టోబరు 13:** సంక్షేమ శాఖల వసతి గృహాల్లో అత్యవసర పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతి గృహాల్లో డైట్ చార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించుకునేందుకు గాను ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఈ నిధులు సమకూర్చింది. హాస్టళ్లకు కేటాయించిన ఈ నిధులకు సంబంధించిన చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు, విద్యా సంస్థలపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపున (ఫేషియల్ రికగ్నిషన్)కు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పూర్తి స్థాయి సమాచారంతో పాటు జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హాస్టళ్లలోని సౌకర్యాలు, వాటి నిర్వహణపై పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.



## పునరుద్ధరణ డిజైన్లు మేం ఇస్తాం

**- కాళేశ్వరం బ్యారేజీలపై ముందుకొచ్చిన ఐఐటీలు - నిస్పాన్, ఆర్వీ అసోసియేట్స్, స్పెయిన్ సంస్థ కూడా**


**హైదరాబాద్, అక్టోబరు 13:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లతోపాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించడానికి మద్రాస్, రూర్కీ, హైదరాబాద్ ఐఐటీలు ముందుకొచ్చాయి. వాటితోపాటు నిప్పాన్, ఆర్వీ అసోసియేట్స్, స్పెయిన్‌కు చెందిన సంస్థ కూడా ఇందుకు ఆసక్తి కనబరిచింది. ప్రధానంగా 14 మీటర్ల ఎత్తు బ్యారేజీల నిర్మాణానికి సహకారం అందించిన సంస్థలు కావాలని ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)ను ఆహ్వానిస్తూ నీటిపారుదల శాఖ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే దీనిని సవరించాలని, 7.5 మీటర్లకు కుదించాలని కోరుతూ ఆయా సంస్థలు నివేదించాయి. కాగా, సోమవారం నీటిపారుదల శాఖ కార్యాలయంలో టెక్నికల్ ప్రీ బిడ్ సమావేశం జరిగింది. మూడు ఐఐటీలు, స్పెయిన్ సంస్థ, నిప్పాన్, ఆర్వీ అసోసియేట్ ఆసక్తి చూపడంతోపాటు మరో వారం గడువు పెంచాలని కోరడంతో వీరి విజ్ఞప్తిని అధికారులు మన్నించే అవకాశాలున్నాయి.

## సుప్రీంలో సానుకూల తీర్పు ఆశిస్తున్నాం

### 42% రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు..

**• మంత్రుల మధ్య విభేదాలు చిన్న సమస్య • టీపీసీసీ చీఫ్ మహేశ్.. ఖర్గేకు పరామర్శ**

**న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 13:** ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థలకు వెళ్లాలనే సంకల్పంతో ఉన్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసే విషయంలో ఇప్పటికే సీనియర్ న్యాయవాదులతో చర్చించామని చెప్పారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, ఒకటికి రెండు సార్లు అన్నీ సరిచూసుకున్నాకే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని, న్యాయ నిపుణులు మరోసారి అన్నింటిని పరిశీలిస్తున్నారని తెలిపారు. ఏ క్షణమైనా పిటిషన్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి మహేశ్ గౌడ్ పరామర్శించారు. అనంతరం తెలంగాణభవన్‌లోని శబరి బ్లాకులో మీడియాతో మాట్లాడారు. ఖర్గే పూర్తిగా కోలుకున్నారని, ఎంతో ఉత్సాహంగా మాట్లాడారని తెలిపారు. అలాగే, ఇటీవల రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, బీసీ రిజర్వేషన్ల అంశం, సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసే విషయం సహా అన్నింటిపై చర్చించామని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో హైకోర్టులో మాదిరే.. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు సైతం సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేసే అవకాశముందన్నారు.సుప్రీంకోర్టులో సానుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. మంత్రుల మధ్య విభేదాలు చిన్న సమస్యని, కాంగ్రెస్ కుటుంబంలో అంతరాలు ఏర్పడితే కూర్చుని మాట్లాడుకుంటామన్నారు. చిన్న, చిన్న విషయాల్లో సమాచార లోపంతోనే స్పర్థలు నెలకొంటున్నాయని, అన్నింటినీ సామరస్యంగా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్ష పదవిని ఆశిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు ఆయా జిల్లాల్లో పర్యటిస్తున్న ఏఐసీసీ పరిశీలకులను కలిసి దరఖాస్తులు ఇవ్వాలని మహేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో సూచించారు. డీసీసీ అధ్యక్షుల ఎంపికలో ఏఐసీసీ నాయకత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని, సమర్థ నాయకత్వానికే పట్టం కట్టనుందని వెల్లడించారు. ఇక ముందు డీసీసీ అధ్యక్షులు పార్టీలో ప్రత్యేక భూమికను పోషించనున్నారన్నారు. టీపీసీసీ, ఇతర ముఖ్య సమావేశాలకు వీరు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతారని.. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలోనూ కీలక పాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు.



### మేడారం జాతరకు రూపురేఖలు

## మారుతున్నాయి

**- రూ.251 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులకు శ్రీకారం**



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:** అశేష భక్తులు ఆరాధించే వన దేవతలైన శ్రీ సమ్మక్క - సారలమ్మ మేడారం జాతర ప్రాంగణం రూపురేఖలను మార్చే విధంగా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ మహాజాతరను కేవలం సీజనల్ ఈవెంట్‌గా కాకుండా శాశ్వత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ క్రమంలో మొత్తం రూ.251 కోట్ల నిధులతో రోడ్లు, పార్కింగ్‌లు, తాగునీటి సౌకర్యాలు, ఘాట్‌లు, శుచీకరణ నిర్మాణాలు, యాత్రికులకు శాశ్వత వసతి గృహాలు వంటి మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. ములుగు జిల్లా మేడారం ప్రాంతంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్, ఎస్పీ, ఆలయ పురోహితులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతర ప్రాంగణానికి చేసిన పర్యటన అనంతరం తొలిదశలో 101 కోట్ల మంజూరు కాగా, గతంలో ఆమోదించిన 150 కోట్లతో కలిపి మొత్తం నిధులను దశలవారీగా వినియోగించనున్నారు. ఇప్పటికే 71 కోట్లకు పైగా పనులకు టెండర్లు పిలవబడగా, వచ్చే 50 రోజుల్లో అన్ని పనులు వ్యవస్థబద్ధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు జారీ అయ్యాయి. ప్రతి సంవత్సరం లక్షలాది భక్తులు తరలివచ్చే ఈ జాతర ప్రాంగణంలో గతంలో కోటి మందికి పైగా రద్దీ నమోద్కైంది. ఈసారి ప్రభుత్వం చేపడుతున్న సదుపాయాల విస్తరణతో భక్తుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గిరిజన మరియు గిరిజనేతర ప్రజల ఆరాధ్య స్థలంగా నిలిచే ఈ పవిత్ర క్షేత్రాన్ని శాశ్వత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని సీతక్క స్పష్టం చేశారు. "సమ్మక్క సారలమ్మల ఆశీర్వాదంతో మేడారాన్ని దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద గిరిజన జాతర కేంద్రంగా అంతర్జాతీయ పర్యాటక మ్యాప్‌లో నిలబెట్టడం మా లక్ష్యం" అని ఆమె తెలిపారు.శాశ్వత ప్రాతిపదికన జరుగుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో రోడ్ల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. జంపన్న వాగు ప్రాంతంలో భారీగా ఏర్పడే రద్దీని దృష్టిలో పెట్టుకుని కొత్త బైపాస్ మార్గాలు, పార్కింగ్ జోన్లు, అత్యవసర సేవల కోసం ప్రత్యేక రక్షణ దళాల స్టేషన్లను ఏర్పాటు చేయాలని అధికారులు సిద్ధమవుతున్నారు. భక్తులు వర్షాకాలంలో ఎదుర్కొనే సమస్యలను నివారించేందుకు నీటి పారుదల కాల్వలు, శుద్ధి చేసిన తాగునీటి సరఫరా కేంద్రాలు, మొబైల్ వైద్య శిబిరాల ఏర్పాటుకు కూడా ప్రత్యేక బడ్జెట్ కేటాయించారు. ఇవన్నీ కాకుండా యాత్రికుల భద్రత, నియంత్రణ కోసం సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దివ్య దర్శనం పొందేందుకు ప్రత్యేక మార్గదర్శక కేంద్రాలు, సమాచారం బోర్డులు, డిజిటల్ హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులోకి రానున్నాయి. మేడారం జాతర కేవలం ఒక వార్షిక ఉత్సవంగా కాకుండా సాంస్కృతిక గిరిజన గుర్తింపుకు ప్రతీకగా నిలిచేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

## ప్రతి 10 మందిలో ఒకరికి కిడ్నీ వ్యాధి

### అవయవ దానంపై అవగాహన పెరగాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**రాయదుర్గం, అక్టోబరు 13:** దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల భారం నానాటికి పెరుగుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి 10 మంది పెద్ద వారిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నట్లు తేలిందన్నారు. హైటెక్‌సిటీలో యశోద హాస్పటల్స్ ఆధ్వర్యంలో 36 నెలల్లో 300 మందికి విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేశారు. ఈ సందర్భంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న వారితోపాటు కిడ్నీ దాతలతో జరిగిన సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ప్రజల్లో అవయవ దానంపై మరింత అవగాహన పెరగాలని చెప్పారు. దీనికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు చొరవ తీసుకోవాలని హితవు పలికారు. నేటి జీవన విధానంతో పలువురు యువకులు కూడా కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చచేశారు. ప్రతి ఏటా సుమారు 6 లక్షల మంది కొత్త కిడ్నీ రోగులు.. డయాలసిస్ దశకు చేరుకుంటున్నారన్న గవర్నర్.. 300 మందికి విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన యశోదా హాస్పిటల్స్ వైద్యులను అభినందించారు. యశోదా హాస్పిటల్స్ గ్రూపు ఎండీ డాక్టర్ జీఎస్ రావు మాట్లాడుతూ దేశంలోని కిడ్నీ మార్పిడి ప్రముఖ కేంద్రాల్లో ఒకటిగా తమ సంస్థ అవతరించిందన్నారు. తమ ఆస్పత్రులన్నీ 3500కి పైగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తే.. హైటెక్ సిటీ యూనిట్ మూడేళ్లలో 300 శస్త్ర చికిత్సల మైలురాయిని చేరుకుందని చెప్పారు. ఆస్పత్రి సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో జనాభాలో 20 శాతానికంటే ఎక్కువ మందిలో క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ) ప్రాబల్యం పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, కిడ్నీ మార్పిడి గ్రహీతలు, కిడ్నీ దాతలు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ లాహోర్‌లో హింసాత్మక ఉద్రిక్తతలు

**- లాహోర్ రణరంగం- టీఎల్‌పీ నిరసన హింసాత్మకం**

**- పోలీస్ అధికారితో పాటు పలు నిరసనకారుల మృతి, పరిస్థితి ఉత్కంఠ**

**- సాద్ రిజ్వీ తీవ్ర గాయాలు.. పాకిస్థాన్‌లో పరిస్థితి నియంత్రణలో లేదని ఆందోళన**



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
పాకిస్థాన్‌లో మరోసారి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. లాహోర్ నగరంలో టీఎల్‌పీ (తెహ్రీక్ ఎ లబ్బైక్ పాకిస్థాన్) పార్టీ చేపట్టిన నిరసన ర్యాలీ అదుపు తప్పి రణరంగాన్ని తలపించింది. ఈ ఘర్షణల్లో ఒక పోలీస్ అధికారి ప్రాణాలు కోల్పోగా, పలు నిరసనకారులు కూడా మృతి చెందినట్లు అక్కడి అధికారులు వెల్లడిరచారు. కాల్పులు, రాళ్ల దాడులు, బాణాసంచా పేలుళ్లతో నగరం మొత్తం గందరగోళానికి గురైంది. ఇజ్రాయెల్ చర్యలను ఖండిస్తూ, పాలస్తీనాకు మద్దతుగా అమెరికా రాయబార కార్యాలయం వైపు లాంగ్ మార్చ్‌గా టీఎల్‌పీ మద్దతుదారులు బయలుదేరారు. ఇస్లామాబాద్ వైపు సాగుతున్న ర్యాలీని ఆపేందుకు పోలీసులు రోడ్లను కంటెైనర్లతో మూసివేశారు. వాటిని తొలగించాలని ప్రయత్నించిన ఆందోళన కారులు మరియు భద్రతా బలగాల మధ్య వాగ్వాదం మొదలై కొద్ది సేపటికే కాల్పుల వరకు దారితీసింది. పంజాబ్ పోలీస్ అధికారి ఉస్మాన్ అన్వర్ వివరాల ప్రకారం, నిరసనకారులు ముందుగా ఆయుధాలతో దాడికి దిగారని, ఒక సీనియర్ పోలీస్ అధికారి అక్కడికక్కడే మృతి చెందారని వెల్లడిరచారు. ఇదే విషయంపై టీఎల్‌పీ నాయకత్వం మాత్రం భిన్నంగా ఆరోపించింది. తమ మద్దతుదారులపై పోలీసులే విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, ఎన్నోమంది ప్రాణాలు కోల్పోయారని పార్టీ ఆరోపించింది. ఈ ఘర్షణల్లో టీఎల్‌పీ చీఫ్ సాద్ రిజ్వీ కూడా బుల్లెట్ గాయాలతో తీవ్రంగా గాయపడ్డారని, ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పార్టీ ప్రకటనలో పేర్కొంది. కాల్పులు ఆపాలని భద్రతా సిబ్బందిని కోరుతూ రిజ్వీ విడుదల చేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియో సమయంలో కూడా కాల్పుల శబ్దాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. లాహోర్‌లోని అనేక రహదారులపై నిరసనకారులు మంటలు పెట్టారు. వాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసుల అదుపు చర్యల్లో ఇప్పటికే వంద మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని ప్రధాన కమ్యూనికేషన్ మార్గాలు నిలిచిపోయాయి. ప్రజలు ఇళ్ల నుంచే బయటకు రావడానికి భయపడుతున్నారు. ఆసుపత్రుల్లో గాయపడిన వారితో హడావుడి వాతావరణం నెలకొంది. గాజా ఘర్షణలు తగ్గుముఖం పడుతున్న సమయంలో టీఎల్‌పీ ఇలా హింసకు దిగడం అర్థం కావడం లేదని పాకిస్థాన్ ఉప అంతర్గత వ్యవహారాల మంత్రి తలాల్ చౌదరి తెలిపారు. రాజకీయ పార్టీలు ఇలాంటి ఉద్రిక్తతలను రెచ్చగొట్టకూడదని ఆయన హెచ్చరించారు. లాహోర్‌లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉండటంతో అదనపు బలగాలు మోహరించబడ్డాయి. ప్రజలు బయటకు రాకుండా ప్రభుత్వ యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది.

# కెనడాతో సంబంధాల బలోపేతంపై చర్చలు

## వాణిజ్యం నుంచి సాంకేతికత వరకు



భారత ప్రతినిధి బృందం కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌ను ఆహ్వానిస్తూ కీలక చర్చలు జరిపింది. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు, సాంకేతిక రంగంలో భాగస్వామ్యం, శక్తి వనరుల మార్పిడి, వ్యవసాయ సహకారం, ప్రజల మధ్య అనుబంధాన్ని మెరుగుపరచే అంశాలపై విస్తృతంగా చర్చించుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడిరచాయి. కెనడాతో ఉన్న సంబంధాలను మరింత బలోపేతం చేసి పరస్పరాభివృద్ధికి దారితీసే విధంగా అనేక ప్రతిపాదనలు చర్చకు వచ్చినట్లు తెలిసింది. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, శుభ్ర శక్తి ప్రాజెక్టులు, వ్యవసాయ రంగంలో నూతన విధానాలపై సహకారం, ఇరు దేశాల ప్రజల మధ్య విద్యా అవకాశాలు, ఉపాధి మార్పిడి వంటి అంశాలు అందులో ఉన్నాయి. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త దిశను చూపుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య రంగంలో భారత్ వేగంగా ఎదుగుతున్న దేశంగా నిలుస్తుండగా, కెనడా పెట్టుబడులకు కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయని భారత ప్రతినిధులు సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా ఐటి, కృత్రిమ మేధస్సు, డిజిటల్ సేవలు, స్టార్టప్ రంగాల్లో భాగస్వామ్యం పెరిగితే ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు లాభం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, ఆధునిక పంట సాంకేతికత, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలపై కలిసి పనిచేయాలన్న సంస్కరణ ప్రతిపాదనలు కూడా చర్చించబడ్డాయి. ప్రజల మధ్య అనుబంధాన్ని బలపర్చడానికి విద్యా మార్పిడి అవకాశాలు, విద్యార్థుల కోసం సులభ వీసా విధానం, ఉద్యోగ రంగంలో కొత్త అవకాశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. భారతీయ కమ్యూనిటీ కెనడాలో కీలక పాత్ర పోషిస్తోందని, ఈ సామాజిక వంతెనను మరింత బలపరిచే మార్గాలపై చర్చ సాగింది. ఇలాంటి చర్చలు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ తరాలకు అభివృద్ధి దిశగా దోహదపడతాయని భావిస్తున్నారు.

# పట్టాలపై జారిన బైక్ దురాంతానికి దారితీసింది

**- గ్రేటర్ నోయిడాలో యువకుడి దుర్మరణం**



తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 11:
ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా ప్రాంతంలో జరిగిన విషాద ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దాద్రి ప్రాంతానికి చెందిన తుషార్ అనే యువకుడు నిర్లక్ష్యంగా రైల్వే గేటును దాటి వెళ్లేందుకు ప్రయత్నించగా, రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మూసి ఉన్న గేటును పట్టించుకోకుండా సాహసంగా వెళ్లేందుకు ప్రయత్నించిన అతని నిర్ణయం చివరకు ప్రాణాపాయం అయింది. సాక్షుల సమాచారం ప్రకారం, తుషార్ బైక్‌పై వచ్చి రైల్వే గేటు మూసి ఉన్నట్లు గమనించాడు. అయినప్పటికీ అతను ఆ గేటు కిందనుంచి బైక్‌ను తీసుకుని పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అయితే అక్కడ నేల నారిగా ఉండడంతో బైక్ అదుపు తప్పి పట్టాల మధ్య జారిపడిరది. ఒక్క క్షణం తుషార్ బైక్‌ను పైకి ఎత్తేందుకు యత్నించగా, అదే సమయంలో వేగంగా రైలు సమీపిస్తోంది. తన బైక్‌ను విడిచి పక్కకు పరిగెత్తాలని చూసేలోపే రైలు ఢీకొట్టడంతో అతడు తుడిచిపెట్టుకుపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దానిలో తుషార్ బైక్‌ను లాగేందుకు పడుతున్న తీవ్ర కసరత్తులు, చుట్టూ ఉన్న వారు కేకలు వేస్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా కనిపిస్తున్నాయి. చాలా మందికి ఇది సాధారణ నిర్లక్ష్యం ఎంత పెద్ద ప్రమాదానికి కారణమవుతుందో చూపించే ఉదాహరణగా మిగిలిపోయింది. ఈ దుర్ఘటన నేపథ్యంగా ఉత్తరప్రదేశ్‌లో రైల్వే క్రాసింగ్‌ల వద్ద భద్రతా చర్యలపై మళ్లీ విమర్శలు మొదలయ్యాయి. జాతీయ నేర గణాంక సంస్థ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, 2023లో దేశవ్యాప్తంగా నమోద్కెన రైల్వే క్రాసింగ్ ప్రమాదాల్లో యూపీకి అత్యధిక శాతం ఉంది. మొత్తం 2,483 ప్రమాదాల్లో 1,025 ఘటనలు ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే నమోదయ్యాయి. మరణాల పరంగా చూస్తే 2,242 మందిలో 1,007 మంది ఈ రాష్ట్రానికి చెందినవారే కావడం పరిస్థితి ఎంత విషమంగా ఉందో తెలుపుతోంది. నిర్లక్ష్యం, అజాగ్రత్త, హెచ్చరికలను పక్కన పెట్టే అలవాటు ఇంకా కొనసాగుతుండటంతో ఇలాంటి ప్రాణ నష్టాలు నమోదవుతున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. రైల్వే గేటు మూసినపుడు ఒక్క క్షణం ఆగితే ప్రాణం నిలుపుకోవచ్చు కానీ తొందరపాటు నిర్ణయాలు జీవితాన్ని సెకన్లలో ముగించగలవని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.

### పేదల జీవనోపాధి కోసం తెలంగాణ సమ్మిళిత కార్యక్రమం మంత్రి సీతక్కను కలిసిన ప్రతినిధులు

**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను బ్రాక్ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ సమ్మిళిత జీవనోపాది కార్యక్రమం అమలు పై వివరాలు అందించింది. రాష్ట్రంలో అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవితాలను ముందుకు తీసుకెళ్లడం కోసం ఈ కార్యక్రమాన్ని సెర్ప్ సహకారంతో అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 3,554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించామని, వీరిలో ఆదివాసీలు, జోగినీలు వంటి సామాజికంగా వెనుకబడిన వర్గాలు ఉన్నాయని నివేదికలో వివరించారు.



ఎంపికైన మండల మహిళా సమాఖ్యల ద్వారా 108 మంది నిపుణులను నియమించి, లబ్ధిదారులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పించి, ప్రోత్సాహకాలు, సౌకర్య పూర్వక రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించి, వారిని స్వయం ఉపాధి పొందే స్థాయికి చేర్చడమే ముఖ్య లక్ష్యమని ప్రతినిధులు తెలిపారు. దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చే మార్గాలను కల్పించి ఈ కుటుంబాలు ఆర్థికంగా స్వాభిమానం కలిగిన స్థితికి చేరుకోవాలని ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భేటీలో ప్రధాన ప్రతినిధులతో పాటు సెర్ప్ అధికారి దివ్యా దేవరాజన్ మంత్రి సీతక్కతో కలిసి సమావేశంలో పాల్గొని కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

# రాజస్థాన్‌లో భారీ పెట్టుబడుల దిశగా అడుగులు

**- అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభం**



**తొవ్వ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
రాజస్థాన్ రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహానికి దారితీసే కీలక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా హాజరై నాలుగు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి ప్రతిపాదనలకు సంబంధించిన గ్రౌండ్ బ్రేకింగ్ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. అదే విధంగా రూ.9,315 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం మరియు శంకుస్థాపనలు నిర్వహించారు. కొత్త క్రిమినల్ చట్టాలకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనను కూడా అమిత్ షా ప్రారంభించారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణను వేగవంతం చేసి ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా ఈ కార్యక్రమాలు మైలురాయిగా భావిస్తున్నారు. పెట్టుబడులు అమలులోకి వస్తే రాజస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎత్తున లాభం చేకూరే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

**ప్రజా సేవలో చెరగని ముద్ర వేసిన నాయకుడి కోల్పోయామని సీఎం నివాళి**

**తొవ్వ,ప్రతినిది ,అక్టోబర్ 13:**



సీనియర్ నాయకుడు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సేవను పరమోద్దేశ్యంగా తీసుకుని నిరంతరం ప్రజల మధ్య ఉండి పనిచేసిన నాయకుడిగా లక్ష్మారెడ్డి పాత్ర విశేషమని సీఎం స్మరించుకున్నారు. ఆయన రాజకీయ ప్రయాణం ఎంతగా ప్రజలకు అండగా నిలిచిందో, అంతే స్థాయిలో సామాజిక రంగంలోనూ తమ సానుభూతి స్వభావంతో గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. జర్నలిజం పట్ల ఉన్న ఆసక్తితో వార్తా సంస్థను స్థాపించడం ద్వారా మీడియా రంగానికి కొత్త దారులు చూపిన వ్యక్తిగా లక్ష్మారెడ్డి సేవలను సీఎం గుర్తుచేశారు. అలాగే హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో మీడియా వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు నడిపిన విషయాన్ని ప్రశంసించారు. కొండా లక్ష్మారెడ్డి మరణం ప్రజా వర్గాలకు, ముఖ్యంగా మీడియా మరియు రాజకీయ రంగాలకు తీరని లోటని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసేవ అనే పవిత్ర మార్గంలో నిబద్ధతగా నడిచిన నాయకుడిని రాష్ట్రం కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు, అభిమానులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కిడ్నీ మార్పిడి సేవలకు గౌరవం

**- యశోద ఆసుపత్రుల కార్యక్రమానికి హాజరైన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన “300కి పైగా ప్రాణ రక్షక కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల వెనుక ఉన్న వైద్య వీరులకు సత్కారం” కార్యక్రమం మరియు “దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల ప్రావీణ్య కేంద్రం” ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రాణాలను కాపాడే సేవలు అత్యున్నతమైన మానవ సేవలని పేర్కొన్నారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో విజయం సాధించి, అనేక కుటుంబాలకు కొత్త జీవితాన్ని అందించిన యశోద ఆసుపత్రి వైద్య బృందం సేవలను ప్రశంసించారు. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన చికిత్స, ఆధునిక సదుపాయాలను అందించే దిశగా యశోద ఆసుపత్రి ముందడుగు వేస్తోందని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి ప్రతినిధులు, రోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. యశోద ఆసుపత్రి ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటివరకు నిర్వహించిన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల ద్వారా 300 మందికి పైగా రోగులు కొత్త జీవితం పొందారని, ఇది వైద్య సిబ్బంది కృషికి నిదర్శనం అని తెలిపారు. అత్యాధునిక పరికరాలు, నిపుణులైన వైద్య సిబ్బంది సమన్వయంతో రోగులు త్వరగా కోలుకునే విధంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మూత్రపిండ వ్యాధులు దేశంలో వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, సమయానికి గుర్తింపు, సరైన చికిత్స, వైద్యుల పర్యవేక్షణ అత్యవసరమని గవర్నర్ సూచించారు. ప్రజల్లో అవగాహన పెరిగితే మరెన్నో ప్రాణాలను కాపాడవచ్చని, యశోద ఆసుపత్రి వంటి వైద్య సంస్థలు ముందుండి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

# పశ్చిమ బెంగాల్ వరదలకు భూటాన్ కారణమని మమతా ఆరోపణ

## - నష్టపరిహారం డిమాండ్



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన వరదలపై రాజకీయ ఉద్రిక్తత చెలరేగింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేస్తూ, పొరుగు దేశమైన భూటాన్ నుంచి ఆకస్మికంగా విడుదలైన నీటి ప్రవాహమే తమ రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిందని ఆరోపించారు. రాష్ట్రం ఎదుర్కొన్న భారీ నష్టానికి భూటాన్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఉందని ఆమె స్పష్టం చేశారు. జల్‌పాయిగుడీ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన తర్వాత మమతా ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉన్న ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయాన్ని అందించలేదని మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. సహాయక చర్యలు, పునరావాస పనులు అన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా నిర్వహిస్తోందని, కేంద్రం నుంచి కేవలం హామీలే వచ్చాయని ఆమె మండిపడ్డారు. భారత్–భూటాన్ మధ్య నదీ నిర్వహణ వ్యవస్థపై ఎన్నోసార్లు చర్చలు జరిపినా, పశ్చిమ బెంగాల్‌కు ఎందుకు ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని ఆమె ప్రశ్నించారు. వరదల వల్ల ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది కుటుంబాలు గృహరహితులయ్యాయి. కొండచరియలు విరిగిపడటంతో అనేక గ్రామాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. సహాయక బృందాలు రంగంలోకి దిగినా, ఇంకా పలుచోట్ల పరిస్థితి విషమంగానే ఉందని అధికారులు చెబుతున్నారు. డార్జిలింగ్, జల్‌పాయిగుడీతో పాటు సరిహద్దు ప్రాంతాలన్నీ నీట మునిగిపోయాయి. నేపాల్, భూటాన్‌లలో కురిసిన భారీ వర్షాలు కూడా ఈ ప్రళయానికి కారణమయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఒక సమీక్షా సమావేశాన్ని నిర్వహించేందుకు సిద్ధమైందని, అక్టోబర్ 16న జరిగే ఆ సమావేశానికి రాష్ట్ర అధికారులు హాజరవుతారని మమతా బెనర్జీ వెల్లడిరచారు. వరదల నుండి బయటపడటానికి అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సమన్వయం అవసరమని, సహకారం లేనిపక్షంలో ఇటువంటివి మళ్లీ పునరావృతం కావచ్చని ఆమె హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను మమతా ఇది రెండోసారి పర్యటించడం విశేషం.

# స్కూల్‌లో దాక్కున్న దుర్మార్గం

**● టాయిలెట్‌లో బాలికపై లైంగిక దాడి ● స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగింపు**

**తొవ్వ,డెస్క్ అక్టోబర్ 13:**
రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన ఈ దారుణ సంఘటన ప్రజలను కలచివేసింది. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం సమయంలో ఒక మధ్యవయస్కుడు గోడ దూకి లోపలకు ప్రవేశించాడు. అక్కడ ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు అతడు నేరుగా స్కూల్ పరిసరాల్లోని టాయిలెట్‌లో దాక్కున్నాడు. కొద్దిసేపటి తర్వాత టాయిలెట్‌కు వచ్చిన ఏడేళ్ల చిన్నారి బాలికపై ఆకస్మికంగా దాడి చేసి లైంగిక అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆకస్మిక దాడితో భయపడిన బాలిక ప్రాణం తోడూ కేకలు వేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. బాలిక అరుపులు విన్న స్కూల్ సిబ్బంది, అక్కడ ఉన్న ఇతర విద్యార్థులు ఆ దిశగా పరుగెత్తారు. తమపై ప్రమాదం రావచ్చనే భయంతో నిందితుడు స్కూల్ గోడ దూకి పారిపోవడానికి యత్నించాడు. అయితే స్థానికులు, సిబ్బంది వెంటపడి అతడిని పట్టుకున్నారు. అదే సమయంలో టీచర్లు ఘటనను తెలుసుకుని వెంటనే బాలికను సురక్షిత స్థలానికి మార్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయడంతో, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వ్యక్తి వయసు 35 ఏళ్లు అని అధికారులు తెలిపారు. బాలికపై వైద్య పరీక్షలు నిర్వహించగా, దాడి జరిగినట్టు నిర్ధారణ అయినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడిరచాయి. ప్రస్తుతం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. ఈ ఘోర ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం



చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల భద్రతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. స్కూల్‌లకు భద్రతా గార్డులు, సీసీ కెమెరాలు, గేట్ల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు తప్పనిసరి చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల భద్రతపై ప్రభుత్వమే ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని సామాజిక వర్గాలు కోరుతున్నాయి. ఇలాంటి సంఘటనలు తరచూ ఎదురవుతుండటంతో, "స్కూల్ అనేది చదువు చెప్పే స్థలం మాత్రమే కాదు, పిల్లలు భద్రంగా ఉండాల్సిన ప్రదేశం కూడా" అనే ప్రశ్న మరోసారి ప్రజల్లో ప్రతిధ్వనిస్తోంది.

# దుర్గాపూర్‌లో మెడికల్ విద్యార్థినిపై దారుణంలో అదుపులో ఐదుగురు నిందితులు

**తొవ్వ ,ప్రతినిధి,అక్టోబర్ 13:**
పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో మెడికల్ విద్యార్థినిపై జరిగిన ఘోర ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్న 23 ఏళ్ల యువతిపై శుక్రవారం రాత్రి కొందరు యువకులు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. బాధితురాలు తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లిన సమయంలో నిందితులు వెంబడిరచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఈ అమానుష చర్యకు ఒడిగట్టారు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న ఆమెను అక్కడే వదిలేసి నిందితులు పరారయ్యారు. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా ఆమె ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి శనివారం నుంచి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, ఆదివారం రాత్రి మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తాజాగా సోమవారం మధ్యాహ్నం ఐదో నిందితుడిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు పట్టుబడినట్లు అసన్‌సోల్–దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్ ప్రకటించింది. అయితే నిందితుల వివరాలను బయటపెట్టలేదు. ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. మహిళా భద్రతపై మళ్లీ ప్రశ్నలు తలెత్తగా, వైద్యవిద్య చదువుతున్న విద్యార్థినిపై జరిగిన ఈ దారుణం సమాజ మానవత్వాన్ని ప్రశ్నించేలా మారింది. ఈ ఘటన వెలుగులోకి రావడంతో కాలేజీ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థి సంఘాలు, మహిళా సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ నిందితులకు కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. వైద్య విద్యార్థిని వంటి భవిష్యత్తు వైద్యురాలిపై ఇలా దాడి



జరగడం సమాజంలో మహిళల భద్రత పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూపుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది. కాలేజీ నిర్వహణ కూడా ఈ ఘటనపై సమగ్ర విచారణకు అభ్యర్థించింది. ఇక పోలీసులు కేసును వేగవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. బాధితురాలి ఆరోగ్యం పూర్తిగా కోలుకున్న తర్వాత ఆమె వాంగ్మూలం కూడా నమోదు చేయనున్నారు. సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ లొకేషన్‌ల ఆధారంగా మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితులపై కఠినమైన సెక్షన్లతో కేసు నమోదు చేసిన పోలీసు విభాగం, వేగవంతమైన కోర్టులో విచారణ జరిపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటన దేశవ్యాప్తంగా మరోసారి మహిళా రక్షణ చట్టాలు అమలు విషయంలో ప్రభుత్వాల బాధ్యతను గుర్తుచేస్తున్నది.

## అపరిశుభ్ర మరుగుదొడ్డి ఫొటోకు రూ.1,000 ఫాస్టాగ్ బహుమతి

**ఈ నెల 31 వరకు అమలు..ఎన్‌హెచ్‌ఏఐ ప్రకటన**

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** టోల్ ప్లాజాల వద్ద పరిశుభ్రత పాటించేలా ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) పలు చర్యలు తీసుకుంటోంది. టోల్ ప్లాజాల వద్ద తమ నిర్వహణలోని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయన్న సమాచారం పంపేవారికి బహుమతి ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రూ. వెయ్యి విలువ చేసే మొత్తాన్ని ఫాస్టాగ్ అకౌంట్‌లో రీఛార్జి చేయనుంది. జాతీయ రహదారిపై ప్రయాణించేవారు అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను గమనిస్తే అందుకు సంబంధించిన ఫొటోనే 'రాజ్ మార్గ్ యాత్ర' యాప్‌లో పోస్టు చేయాల్సి ఉంటుంది. వినియోగదారుడి పేరు, లొకేషన్, వాహనం రిజిస్ట్రేషన్ నెంబరు, ఫోన్ నెంబరు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అర్హత సాధించిన ఫొటోను ఎంపిక చేసిన అనంతరం రూ. వెయ్యి సంబంధిత వెహికల్ రిజిస్ట్రేషన్ నెంబరు (వీఆర్‌ఎన్)కు అనుసంధానమైన ఫా స్టాగ్‌కు జమ అవుతాయి. ఈ కార్యక్రమం ఈ నెల 31 వరకు అమల్లో ఉంటుంది.

# రాజకీయ కక్షతో పెట్టిన కేసు

**బీజేపీపై పోరాటం ఆగదు" తేజస్వి యాదవ్**




**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 13:**
ఢల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఐఆర్‌సీటీసీ హొటల్ అవినీతి కేసులో లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవి, తేజస్వి యాదవ్ తదితరులపై అభియోగాలు దాఖలు చేయగా, దీనిపై ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ ఘాటు స్పందన వ్యక్తం చేశారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ కక్షతో పెట్టిందని, ఎన్నికలు సమీపిస్తుండడంతోనే మళ్లీ కేసును ముందుకు తెచ్చారని ఆరోపించారు. కోర్టు తీర్పును గౌరవిస్తున్నామన్నారు కానీ బీజేపీ రాజకీయ ఆటను బహిర్గతం చేసే పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

**లాలూ పేరు రైల్వే చరిత్రలో చిరస్థాయి.. తేజస్వి వ్యాఖ్యలు**

మీడియా ముందుకు వచ్చిన తేజస్వి, "రైల్వేలకు రూ.90,000 కోట్ల లాభం చేకూర్చిన మనిషి లాలూ. ప్రతి రైల్వే బడ్జెట్‌లో టిక్కెట్ ధరలను తగ్గించాము. ఆయన చేసిన సంస్కరణలను చదివేందుకు హార్వర్డ్ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు వచ్చిన విషయం దేశానికి తెలుసు. రైల్వే సిస్టమ్‌ను మేనేజ్ చేయడంలో లాలూ ఒక పాఠశాల లాంటి వారు" అని అన్నారు. అయన ఇంకా మాట్లాడుతూ, "బీహార్ ప్రజలు చాలా తెలివైనవారు. ఎవరు ఏమి చేస్తున్నారు అన్నది వాళ్లకు బాగా తెలుసు. ఈ కేసు ఎన్నికల కోసం రాజకీయ ఆయుధంగా వాడుతున్నారు. బీజేపీ ఎంత ఒత్తిడి తెచ్చినా మా పోరాటం ఆగదు" అని హెచ్చరించారు.

**ఐఆర్‌సీటీసీ కేసులో కోర్టు అభియోగాలు నమోదు**

లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో రాంచీ, పూరీ ఐఆర్‌సీటీసీ హొటల్ టెండర్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్న ఈ కేసులో మొత్తం 14 మంది నిందితులపై అభియోగాలు నమోదుకు తగిన ఆధారాలున్నాయని కోర్టు స్పష్టం చేసింది. మోసం, నేరపూరిత కుట్ర, అవినీతి నిరోధక చట్టాల కింద అభియోగాలు పెట్టినట్లు వెల్లడైంది. లాలూ తరఫు న్యాయవాది మాత్రం, "ఎలాంటి అవినీతి జరగలేదు. మేము కేసును పూర్తిగా ఎదుర్కొంటాం. నిజం బయటపడుతుంది" అని కోర్టులో స్పష్టం చేశారు.

**బీజేపీ-ఆర్జేడీ మధ్య రాజకీయ సమరం మళ్లీ ముదురుతుంది**

ఈ అభివృద్ధితో బీహార్ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తత ఉత్పన్నమైంది. తేజస్వి యాదవ్ చేసిన పదునైన వ్యాఖ్యలు మరోసారి బీజేపీ–ఆర్జేడీ రాజకీయం వేడెక్కించాయి. ఇక నుంచి ఈ కేసు న్యాయపరంగా ముందుకు సాగుతుందా? లేక రాజకీయ రంగం మరింత వేడెక్కుతుందా? అన్న ప్రశ్నలతో దేశవ్యాప్తంగా దృష్టి ఆకర్షితమవుతోంది.

# జూబ్లీహిల్స్‌లో చోరీ ఓట్ల స్కాం


**కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు**



**తొవ్వ,అక్టోబర్ 13:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తప్పుడు పద్ధతులతో గెలవాలని చూస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ ఓటు చోరీ గురించి మాట్లాడుతుంటే, ఇక్కడ మాత్రం కాంగ్రెస్ పార్టీ చోరీ ఓట్లతో విజయం దక్కించుకునేందుకు అనైతిక మార్గాలను అనుసరిస్తోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో భారీగా డూప్లికేట్ ఓట్లు, దొంగ ఓట్లు నమోదయ్యాయని, ఈ అవకతవకలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. అనంతరం పార్టీ కీలక నేతలతో కలిసి మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ నేతలు పరిపాలన యంత్రాంగాన్ని రాజకీయ లాభాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఉప ఎన్నికను ఏ రీతినైనా గెలవాలని కాంగ్రెస్ నేతలు అన్ని రకాల దందాలు చేస్తున్నారని, రాష్ట్ర క్యాబినెట్ మొత్తాన్ని జూబ్లీహిల్స్‌లో క్యాంప్ చేయించి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఒక వైపు తమే నిధుల కేటాయింపులపై ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాసి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, ఇప్పుడు జూబ్లీహిల్స్‌కు అకస్మాత్తుగా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు హామీలు ఇస్తున్నారని ప్రజలను మరోసారి మోసం చేసే యత్నంగా పేర్కొన్నారు. ఇలాంటి అవకతవకలకు గట్టి ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని, ప్రజాస్వామ్య ప్రక్రియను కాలరాసే అలవాటే కాంగ్రెస్ పార్టీ అసలు ముఖమని కేటీఆర్ ముద్ర వేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఈ ఓటు చోరీ కుట్ర కేవలం ఒక నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాదని, ఇది రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలనే కాంగ్రెస్ పార్టీ వ్యూహానికి భాగమని ఆరోపించారు. ఓటర్ల నిజమైన హక్కులను ?నిగొట్టే ప్రయత్నం ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడమేనని ఆయన పేర్కొన్నారు. నిజమైన ఓటర్ల ధ్వనిని నకిలీ ఓట్లతో మూయించే ప్రయత్నం చేస్తే బీఆర్‌ఎస్ మౌనంగా ఉండదని హెచ్చరించారు. జనాభా రిజిస్టర్, ఆధార్, ఓటర్ల జాబితా ̱ ఇవన్నీ ప్రజల ప్రామాణిక సమాచారాన్ని భద్రపరిచే పత్రాలు కావాలి గానీ, సొంత లాభం కోసం మార్పులు చేస్తే అది నేరమని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజల ఓటు శక్తిని లెక్కచేయకుండా, అధికార దుర్వినియోగం చేసి ఎన్నికలను ప్రభావితం చేయాలని చూసే వారిని చట్టం ముందు నిలబెట్టడానికి తాము అన్ని మార్గాల్లో పోరాడతామని తెలిపారు.

# ఆర్ఎస్ఎస్‌పై దర్యాప్తు డిమాండ్

- పవన్ ఖేరా వ్యాఖ్యలు సంచలనం
- ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలపై కొత్త వివాదం
- పిల్లల ఆలోచనలపై ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు
- రాజకీయ వేదికపైకి ఎక్కిన భావజాల పోరాటం



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
ఒక భావోద్వేగ సంఘటనను గుర్తుచేసుకుంటూ ఢల్లీకి చెందిన ఏఐసీసీ మీడియా చైర్మన్ పవన్ ఖేరా కఠినమైన వ్యాఖ్యలు చేశారు. చిన్నప్పుడే తన దాదమ్మ ఆర్ఎస్ఎస్ శాఖ జరుగుతున్న పార్క్‌కు వెళ్లొద్దని చెప్పేదని, అప్పుడు అర్థం కాకపోయిన ఆ మాట ఇప్పుడు అర్థమైందని ఆయన అన్నారు. సమాజంలో ఆనందు అజీ వంటి పిల్లలకు న్యాయం చేయాలంటే ఆ సంస్థపై నిజాలు బయటకు తీయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పవన్ ఖేరా అభిప్రాయం ప్రకారం, ఇటువంటి శాఖల పేరుతో చిన్నారులపై మతపరమైన ముసుగులో మానసిక ప్రభావం చూపడం ఖండనీయమని చెప్పారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, ఇందులో ఆరోపణలకు గురైనవారికి తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. సమాజంలో ఇలాంటి సంస్థ నడపాలనుకునే వారికి ఇది ఒక హెచ్చరికగా మారాలని ఆయన వ్యాఖ్యానించారు.రాజకీయ వర్గాల్లో ఈ వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. కాంగ్రెస నేతల అభిప్రాయం ప్రకారం, పిల్లలను ప్రభావితం చేసే ఏ సంస్థ పైనా పారదర్శక విచారణ తప్పనిసరిగా జరగాలని, లేకపోతే భవిష్యత్తులో మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా చురుకైన చర్చ జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ అనేది దేశభక్తి సంస్థ అని కొందరు సమర్థిస్తుండగా, పిల్లలపై మానసిక ప్రభావం చూపడం సరికాదని మరికొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇటువంటి సున్నితమైన విషయాలపై రాజకీయాలకతీతంగా సామాజిక దృక్కోణంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని పౌర సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.మరోవైపు, కాంగ్రెస నేతలు ఈ అంశాన్ని పార్లమెంట్ వరకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సమాజం లో భయంతో కాకుండా అవగాహనతో జీవించడానికి పిల్లలు అర్హులని, వారి ఆలోచనా విధానాన్ని ఏ సంస్థ అయినా ఏకపక్షంగా మలచకూడదని వారు అంటున్నారు. విద్య, సంస్కారం కుటుంబం నుంచి వస్తాయని, మతపరమైన శిక్షణ పేరుతో ఒకే విధమైన సిద్ధాంతాన్ని బలవంతంగా బోధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. తరువాతి రోజుల్లో ఈ వివాదం మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఈ విషయంపై స్పష్టమైన వైఖరి ఎప్పుడు ప్రకటిస్తుందో అన్న ప్రశ్న అందరి మదిలో ఉంది. నిజం ఏమిటి, ఆరోపణల్లో ఎంత వరకు నిజం ఉందో బయటపడే వరకు దేశవ్యాప్తంగా ఆసక్తిగా ఈ ఘటనను గమనించే పరిస్థితి నెలకొంది.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పాల్సిన సమయం

## హరీశ్‌రావు మాటల్లో ఆగ్రహం



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి గట్టి దెబ్బ తగలాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఏడున్నర వందల రోజులు దాటినా ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదని ఆయన మండిపడ్డారు. ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి ఇప్పుడు ప్రజాభిప్రాయం ఎలా ఉంటుందో చూపించేది ఈ ఉప ఎన్నికేనని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌కు మాత్రమే కాకుండా యావత్ తెలంగాణ దృష్టి ఈ ఉప ఎన్నికపై ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**రాష్ట్రం అవినీతి చీకటిలోకి నెట్టారు : హరీశ్‌రావు ఆరోపణలు**
రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అవినీతి వ్యవస్థీకృతంగా పెరిగిందని హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ఒకప్పుడు కేసీఆర్ పాలనలో పెట్టుబడిదారుల స్వర్గధామంగా ఎదిగిన తెలంగాణ, ఇప్పుడు లంచాల కోసమే పేరొందుతోందని దుయ్యబట్టారు. బిల్డింగ్ పర్మిషన్లకు స్క్వేర్ ఫీటుకు డబ్బులు, ఫైనాన్స్ బిల్లులు పాస్ కావాలంటే శాతం కమీషన్లు, భూముల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున లంచాలు ఇవన్నీ ప్రభుత్వమే నడిపిస్తున్న అవినీతి వ్యవస్థలో భాగమయ్యాయని హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ఎలా ఉండాలో చూపించాడని, రేవంత్ రాష్ట్రం ఎలా నాశనం అవుతుందో చూపిస్తున్నాడని వ్యాఖ్యానించారు.

**ప్రజల జీవనానికి ముట్టడిగా మారిన కాంగ్రెస్ విధానాలు**
ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు ప్రారంభించిన బస్తీ దవాఖానలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. వైద్య సిబ్బంది జీతాలు ఆరు నెలలుగా ఇవ్వకపోవడంతో సేవలు దెబ్బతిన్నాయని, పేదలకు అవసరమైన మందులు కూడా లభించడం లేదన్నారు. నీళ్ల బిల్లులు కూడా భారీగా వసూలు చేస్తున్నారని, కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నప్పుడు 20 వేల లీటర్ల వరకు బిల్లు లేకుండా సదుపాయం ఉండేదని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం పేదలపై భారాలు మోపడం తప్ప ఏ ఒక్క ప్రజా హితం జరగలేదని విమర్శించారు. జూబ్లీహిల్స్‌ను కేవలం ఒక నియోజకవర్గంగా చూడకూడదని, ఇది పేదల ఇళ్ల కోసం పోరాడుతున్న వారి గళమని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చి, పెద్దల ఇండ్లను వదిలిపెడుతున్నారని ప్రజలలో ఆగ్రహం పెరుగుతోందన్నారు. కాంగ్రెస్ గెలిస్తే బుల్డోజర్లు మళ్లీ పేదల గడపల వద్దకు వస్తాయని హెచ్చరిస్తూ, మాగంటి సునీతను గెలిపించడం అంటే పేదల గెలుపు, హైడ్రా బాధితుల గెలుపు, పింఛన్లు రాని వృద్ధుల గెలుపు, నిరుద్యోగుల గెలుపు అని స్పష్టం చేశారు. ప్రజలు ఈసారి సరైన సందేశాన్ని రేవంత్‌రెడ్డికి ఇవ్వాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తుపై సీఎం ఫోకస్

- హాస్టళ్లకు 60 కోట్ల కేటాయింపు.. - విద్యార్థుల సౌకర్యాలపై సీఎం రేవంత్ దృష్టి
- హాస్టళ్లకు నిధుల వెల్లువ.. విద్యార్థుల్లో నూతన ఆశలు - సాంకేతిక పర్యవేక్షణతో పారదర్శకతకు బాట - మార్పు కోసం దృఢసంకల్పం



**తొవ్వ ,అక్టోబర్ 13:**
బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల వసతి గృహాల అత్యవసర అవసరాల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 60 కోట్ల రూపాయలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హాస్టళ్లలో డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బందికి జీతాలు, మోటార్ల మరమ్మతులు, తక్షణ పరిష్కారం కావాల్సిన ఇతర పనులకు ఈ నిధులు వినియోగించే వీలుండనుంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంబంధిత శాఖల సీనియర్ అధికారులకు స్వయంగా అందజేశారు. సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో హాస్టళ్ల పరిస్థితులపై సీఎం ప్రత్యేకంగా చర్చించారు. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు, బోధన సిబ్బంది ముఖ గుర్తింపు వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థుల నమోదు నుంచి, ఆహారం నాణ్యత వరకు ప్రతిదీ డేటా ఆధారంగా ఉండాలని ఆదేశించారు. "విద్యార్థులకు అందుతున్న పోషకాహారం ఎంత కేలరీలు ఇస్తోంది, అది ప్రామాణిక ప్రమా ణాలకు సరిపోతుందా?" అనే అంశంపై ఖచ్చితమైన పర్యవేక్షణ అవసరమని సీఎం అన్నారు.హాస్టల్ యూనిఫాంలు, పుస్తకాలు సమయానికి అందాల్సిందిగా అధికారులను హెచ్చరించారు. హాస్టళ్లలోని అన్ని సదుపాయాల వివరాలు, మరమ్మతులు, నిర్వహణ చర్యలను రియల్‌టైమ్‌గా డాష్‌బోర్డ్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను హాస్టళ్లతో అనుసంధానం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సేవలు అందేలా వైద్యులు అందుబాటులో ఉండే హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని కూడా సీఎం ఆదేశించారు. అంతోటే ఆగకుండా, భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలకు హాస్టల్ విద్యార్థులు సిద్ధం కాగలిగేలా ఎడ్‌టెక్ సహకారం తీసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న సదుపాయాలు, ప్రభుత్వ సహకారం సోషల్ మీడియాలో స్పష్టంగా చూపించాలని, ఉద్దేశపూర్వకంగా జరిగే తప్పుడు ప్రచారం అరికట్టాలని సీఎం రేవంత్ అధికారులకు హితవు పలికారు. అవసరమైన యాప్‌లు వెంటనే తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షకు ముందు సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్ల ప్రస్తుతం పరిస్థితులపై విస్తృత ప్రజెంటేషన్ అందించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారులు మరియు ఉన్నతాధికారులు హాజరయ్యారు. మొత్తం మీద రాష్ట్రంలోని వసతి గృహాల వ్యవస్థను సాంకేతికతతో మిళితం చేసి పారదర్శకత, బాధ్యతారాహిత్యానికి చెక్ పెట్టే దిశగా సీఎం రేవంత్ తీసుకున్న చర్యగా ఈ నిర్ణయం అభివర్ణించబడుతోంది. ముఖ్యంగా హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంచుతోంది. ఇప్పటివరకు నిధుల కొరత వల్ల నిల్వబడ్డ పనులు, డైట్ ఛార్జీల చెల్లింపులు, వైద్య శిబిరాల నిర్వహణ వంటి అంశాలకు ఈ నిధులు మేలుకలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ, పల్లెటూర్ల నుంచి వచ్చే పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్ తీసుకున్నఈ చర్య పౌరసమాజం నుంచి ప్రశంసలు అందుకుంటోంది. హాస్టళ్ల నిర్వహణలో సాంకేతిక పర్యవేక్షణ ప్రవేశపెట్టి పారదర్శకతను తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక చేసింది. విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునే యాప్ రూపకల్పన, ఆరోగ్య సేవల కోసం ప్రత్యేక హాట్‌లైన్, ఎప్పటికప్పుడు మానిటరింగ్ కోసం డాష్‌బోర్డ్‌ఇవి అన్నీ అమల్లోకి వచ్చితే రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల పరిస్థితి పూర్తిగా మారే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయడం మాత్రమే కాకుండా అమలుపై నేరుగా సీఎం దృష్టి పెట్టడం ఈ కార్యక్రమంపై ప్రభుత్వ గంభీరతను స్పష్టం చేస్తోంది.

# పూరన్ కుమార్ కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ



**తొవ్వ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
న్యూఢల్లీ: చండీఘడ్‌లో ఆత్మహత్య చేసుకున్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈరోజు (సోమవారం) పరామర్శించారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్, కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిరచారు ఉపముఖ్యమంత్రి. సీఎం రేవంత్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని.. పూరన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారని ఈ సందర్భండి భట్టి విక్రమార్క తెలిపారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను పరామర్శించడానికి వచ్చిన హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి సూసైడ్ నోట్ ఆధారంగా ఎంత పెద్ద వాళ్ళు ఉన్నా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పూరన్ కుమార్ అత్యంత ప్రతిభావంతుడని.. ప్రసిద్ధి గాంచిన ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పట్టభద్రుడని.. ఐఐఎం అహ్మదాబాదులో చదివిన గొప్ప మేధావి అని కొనియాడారు డిప్యూటీ సీఎం. ఉన్నతాధికారుల కుల వివక్ష, వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవడం.. చాలా తీవ్రమైన అంశమన్నారు. పూరన్ కుమార్ సూసైడ్ నోట్ డైయింగ్ డిక్లరేషన్‌గా భావించాలని కోరారు. ఈ ఘటన జరిగి ఇన్ని రోజులు అయినా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. వృద్ధ తల్లిదండ్రులను, ఇద్దరు ఆడపిల్లలు ఉన్న పూరన్ కుమార్ కుటుంబానికి రక్షణ కల్పించి ఆదుకోవాలని హర్యానా ప్రభుత్వాన్ని, చండీఘర్ పోలీసులను డిమాండ్ చేశారు. కపూర్ అనే అధికారి దళిత వ్యతిరేకి అని తెలిసి కూడా బీజేపీ ప్రభుత్వం అతన్ని డీజీపీని చేసిందని.. ఈ ప్రభుత్వం ఇన్నేళ్ల స్వతంత్ర భారతదేశంలో డెత్ బెడ్ మీద ఉండి కూడా న్యాయం కోసం ప్రాధేయపడడం దురదృష్టం అంటూ భట్టి వ్యాఖ్యలు చేశారు. అత్యంత పిన్న వయసులోనే ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత పూరన్ కుమార్ అని అన్నారు. అతని చివరి డెత్ లెటర్ ఆధారంగా సంబంధిత అధికారుల మీద చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. హర్యానా, చండీగఢ్ ప్రభుత్వాలు బీజేపీ పాలనలో ఉన్నాయని.. సీఎం రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్నారు. తాము చట్టాన్ని ధిక్కరించే పని అడగడం లేదని.. బాధ్యత గల ప్రభుత్వాలు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని అడుగుతున్నామన్నారు. తెలంగాణ సీఎం రేవంత్.. పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.ద

# మేడారం అభివృద్ధిపై దృష్టి

## సీఎం దిశానిర్దేశంతో వివరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**
"నేనేంటో అందరికీ తెలుసు" అంటూ తన రాజకీయ ధోరణి, నాయకత్వ విశ్వాసాన్ని స్పష్టంగా తెలియజేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. రాష్ట్ర అభివృద్ధి మీద ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రతి పనిని ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడిరచారు. ప్రత్యేకంగా మేడారం జాతర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ మహా జాతరకు లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో రహదారులు, త్రాగునీటి సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందని చెప్పారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సమ్మక్క సారలమ్మ జాతర తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని గుర్తుచేశారు. ఈ పవిత్ర కార్యక్రమానికి రాష్ట్ర మహిళా నేతలు సీతక్క, సురేఖ అక్కలతో కలిసి హాజరై అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు వెల్లడిరచారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ధర్మమని పేర్కొన్నారు. మేడారం జాతర ప్రాంతం భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకునేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. తాత్కాలిక వసతి గృహాలు, పార్కింగ్ స్థలాలు, భక్తులకు విశ్రాంతి కేంద్రములు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్థానికులు కూడా ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటే మేడారం ప్రాంతం సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు స్థానిక కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. అభివృద్ధి పనుల్లో తమకు అవకాశం దక్కుతోందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చూపుతున్న చురుకుదనంతో మేడారం జాతర ఈసారి కొత్త మార్పులకు ఆవాసమవుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# కేంద్రం నుంచి భారీ నిధుల ఆమోదం

### - ముఖ్య ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు - రవాణా రంగానికి కొత్త శకం ప్రారంభం

**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13**
తెలంగాణ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. హ్యామ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 431 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారుల నిర్మాణానికి ఆమోదం లభించింది. మొత్తం ఇరవై ఐదు వేల ఆరు వందల అరవై ఒక కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. కేంద్రం నలభై శాతం, నిర్మాణ సంస్థలు అరవై శాతం వ్యయం భరించనున్నాయి. దేశ వ్యాప్తంగా వంద ఇరవై నాలుగు జాతీయ రహదారి ప్రాజెక్టులకు అనుమతులు లభించగా, అందులో తెలంగాణకు ఐదు ప్రధాన మార్గాలు లభించడం రాష్ట్రానికి గర్వకారణంగా మారింది. అర్మూర్ నుంచి జగిత్యాల, జగిత్యాల నుంచి మంచిర్యాల్ వరకు నాలుగు లేన్లుగా విస్తరణ చేపట్టనున్నారు. జగిత్యాల నుంచి కరీంనగర్ మార్గం కూడా ఈ జాబితాలోనే ఉంది. అదనంగా మహబూబ్ నగర్ నుంచి రాయచూర్ దిశగా సాగుతున్న రహదారికి కూడా నిధులు కేటాయించారు.

**ముఖ్య ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు**
హైదరాబాద్ ప్రాంతీయ వలయ రహదారి నిర్మాణానికి పదిహేను వేల ఆరు వందల ఇరవై ఏడు కోట్లు కేటాయించారు. ఈ నూట అరవై కిలోమీటర్ల మార్గం పూర్తి అయితే నగర పరిసర రవాణాకు పెద్ద ఊరట లభిస్తుంది. మహబూబ్ నగర్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు ఉన్న రహదారి విస్తరణకు రెండువేల ఆరు వందల అరవై రెండు కోట్లు, జగిత్యాల నుంచి మంచిర్యాల్ మార్గానికి రెండువేల ఐదు వందల యాభై కోట్లు, అర్మూర్ నుంచి జగిత్యాల రహదారికి రెండువేల మూడు వందల ముప్పై ఎనిమిది కోట్లు, జగిత్యాల నుంచి కరీంనగర్ మార్గానికి రెండువేల మూడు వందల ఎనభై నాలుగు కోట్లు కేటాయించారు.

**రవాణా రంగానికి కొత్త శకం ప్రారంభం**
ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే రాష్ట్ర రవాణా వ్యవస్థకు కొత్త జీవం లభిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టూ రహదారులు విస్తరించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని అంచనా. పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం వంటి రంగాలకు రవాణా సౌకర్యాలు మరింత చేరువవుతాయని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రజలకు ఈ ప్రాజెక్టులు దీర్ఘకాలిక లాభాలు చేకూర్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకమైంది. గ్రామీణ



ప్రాంతాల నుంచి పట్టణాలకు రవాణా సులభతరం కావడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు వేగంగా మార్కెట్లకు చేరే అవకాశం ఉంటుంది. రైతులు తమ పంటలను సమయానికి విక్రయించుకోవడానికి ఈ రహదారులు ప్రధాన మార్గాలుగా మారవచ్చు. సరుకు రవాణా ఖర్చులు తగ్గటం వల్ల రైతులకు అదనపు లాభం చేకూరే అవకాశం ఉంటుంది. పర్యాటక రంగానికి కూడా ఈ రహదారుల నిర్మాణం కొత్త అవకాశాలు తెరుస్తుందని అంచనా. జిల్లాల మధ్య రాకపోకలు మెరుగుపడితే పర్యాటక ప్రాంతాలకు చేరుకోవడం మరింత సులభతరం అవుతుంది. కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల్ వంటి ప్రాంతాల్లో ఉన్న సహజ, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలు మరింత మంది సందర్శకులను ఆకర్షించే అవకాశం ఉంది.నిర్మాణ రంగానికి ఈ భారీ ప్రాజెక్టులు ఉపాధి అవకాశాలను తీసుకొస్తాయి. వేలాదిమంది కార్మికులకు ఈ పనులు ఉపాధి మార్గాలను అందిస్తాయని అంచనా. స్థానిక కాంట్రాక్టర్లు, నిర్మాణ సామగ్రి సరఫరాదారులకు కూడా ఈ ప్రాజెక్టులు ఆర్థిక లాభాలను అందిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వ్యాపారాలకు కూడా వేగం చేరుతుంది. ప్రభుత్వ విభాగాలు, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పని చేస్తే ఈ ప్రాజెక్టులు నిర్ణీత గడువుల్లో పూర్తి అయ్యే అవకాశం ఉంటుంది. నాణ్యతపై దృష్టి సారిస్తే రహదారులు దీర్ఘకాలం పాటు ప్రజలకు ఉపయుక్తం అవుతాయి. అభివృద్ధి పనుల ద్వారా రాష్ట్రానికి కొత్త రవాణా దశ ప్రారంభమవుతుందని ప్రజల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.

# చలాన్లు పెండింగ్ ఉంటే వెహికిల్ సీజ్



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:**
రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. ఎన్ని కఠిన నిబంధనలు విధించినా ప్రమాదాలు తగ్గడం లేదు. వివిధ కారణాలతో వాహనదారులు రూల్స్ అతిక్రమిస్తున్నారు. జరిమానా విధించినా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో జరిమానా వసూలుతోపాటు వాహనదారుల్లో మార్పు కోసం మరికొన్ని కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. మోటారు వెహికిల్స్ రూల్స్- 1989లో కేంద్రం ప్రతిపాదించిన సవరణలు రవాణా నియంత్రణలో కొత్త పద్ధతులను తీసుకురావడం లక్ష్యంగా ఉన్నాయి. ఇప్పటి వరకు చలాన్ చెల్లించడానికి ఇచ్చిన 90 రోజుల గడువును 45 రోజులకు తగ్గించాలని నిర్ణయించారు. నిర్ణీత గడువులో చెల్లించని వాహనాలు సీజ్ చేసే అధికారం అధికారులకు లభించనుంది.కొత్త నిబంధనల ప్రకారం ఐదుకుపైగా ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదైతే డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. తరచూ నిబంధనలు అతిక్రమించే డ్రైవర్లను నియంత్రించడానికి ఇది సమర్థమైన చర్యగా భావిస్తున్నారు.చలాన్ చెల్లింపులో ఆలస్యం జరిగితే, ఆ వాహనంపై ఏ రకమైన రిజిస్ట్రేషన్, బీమా లేదా విక్రయ లావాదేవీలు చేయడం సాధ్యంకాదని తాజా ముసాయిదా నిబంధనలు చెబుతున్నాయి. ఇది చట్టం సక్రమంగా అమలుకు దోహదం చేస్తుంది.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను ఇప్పటి కంటే వేగంగా పరిష్కరించేందుకు, ఘటన చోటు చేసుకున్న మూడు రోజుల్లోపు నోటీసు జారీ చేయడం తప్పనిసరి కానుంది. ఈ చర్యతో వ్యవస్థ పారదర్శకంగా, సమయపాలనతో నడవడం సులభమవుతుంది.ప్రతిపాదనలు తుది రూపం దాల్చే ముందు, వీటిపై ప్రజల అభిప్రాయాలను స్వీకరించాలని కేంద్రం నిర్ణయించింది. సూచనలు లేదా అభ్యంతరాలు ఉన్నవారు రవాణాశాఖ అదనపు కార్యదర్శికి పంపించవచ్చని తెలిపింది.రోడ్డుపై క్రమశిక్షణ పెంచడం, ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గించడం కొత్త నిబంధనల ప్రధాన లక్ష్యం. వాహనదారుల్లో చట్టపరమైన అవగాహన, బాధ్యత పెంచడం ద్వారా ప్రమాదాల శాతం తగ్గించాలనే ప్రభుత్వ ఆశయం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ కఠినతరం కావడంతోపాటు, నగరాల్లో క్రమశిక్షణ గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

# బీహార్‌లో కింగ్ మేకర్‌గా పీకే...




**పాట్నా, అక్టోబరు 13:**
ప్రశాంత్ కిషోర్. పేరుపొందిన రాజకీయ వ్యూహకర్త. మనదేశంలో రాజకీయాలను కూడా కార్పొరేట్ మయం చేసిన వ్యక్తి. పైగా ఎలాంటి రాజకీయాలు చేయాలో.. ఎలాంటి రాజకీయాలు చేస్తే ఓట్లు పడతాయో.. ఒక స్ట్రాటజీ మాదిరిగా అతను చెప్పేవాడు. మనదేశంలో ఉన్న మెజారిటీ రాజకీయ పార్టీలకు అతడు పని చేశాడు. అయితే ఎక్కువసార్లు అతడి ప్రణాళికలు విజయవంతమై.. అతడు పని చేసిన రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఏపీలో వైసిపి, టిడిపి, కేంద్రంలో బిజెపి, ఒకానొక సందర్భంలో భారత రాష్ట్ర సమితి, టిఎంసి.. ఇలా అనేక రాజకీయ పార్టీలు అతడి ప్రణాళికలను అమలు చేసి అధికారంలోకి వచ్చాయి. ఎవరికో సేవలు చేసి.. అధికారంలోకి తీసుకొచ్చే బదులు.. తనే ఒక రాజకీయ పార్టీని పెట్టాలని ప్రశాంత్ కిషోర్ అనుకున్నాడు. అనుకున్నది తడవుగా జన్ సూరజ్ పేరుతో పార్టీ ని ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఆ పార్టీ బీహార్ రాష్ట్రంలో పోటీ చేస్తోంది.ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో ప్రశాంత్ కిషోర్ పార్టీ బీహార్ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోందని తెలిపింది.. అందువల్లే ప్రశాంత్ కిషోర్ వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని తనదైన వ్యూహాలతో ఇబ్బంది పెడుతున్నారు. గతంలో ఈ పార్టీలతో పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్ తనదైన చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారు.. ఏమాత్రం అవకాశం దొరికినా చాలు రెచ్చిపోతున్నారు. తను ఇప్పటికిప్పుడు అధికారంలోకి రాకపోయినా పర్వాలేదు గానీ.. బీహార్ రాష్ట్ర అభివృద్ధిని మాత్రం విస్మరించేది లేదని ప్రశాంత్ కిషోర్ చెప్తున్నారు..రాజకీయ వ్యూహ కర్తగా పేరుపొందిన ప్రశాంత్ కిషోర్ పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తాను ఎదుర్కొన్న రాజకీయపరమైన విషయాలను మొహమాటం లేకుండా చెబుతున్నారు. 2021 నుంచి ఇప్పటివరకుకన్సల్టెన్సీ సేవల ద్వారా తాను 241 కోట్లు సంపాదించాలని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. వీటిలో 30.95 కోట్లు జీఎస్టీ రూపంలో.. 20 కోట్లు ఐటి రూపంలో చెల్లించినట్టు పేర్కొన్నారు. 98.75 కోట్లను పార్టీకి డొనేషన్‌రూపంలో ఇచ్చినట్టు వెల్లడించారు. తన నైపుణ్యాన్ని అనుభవాన్ని ఉపయోగించి రెండు గంటలకు 11 కోట్లు తీసుకున్నట్టు ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు.. ”రాజకీయాలు,వ్యాపారం వేరు వేరు కాదు. ఒక వ్యాపారి ముందస్తు లాభాలను గురించి పెట్టుబడి పెడుతుంటాడు. జనాల అవసరాలకు తగ్గట్టుగా నడుచుకుంటాడు. రాజకీయ పార్టీలు కూడా అంతే. జనాల అవసరాల ఆధారంగా హామీలు ఇస్తుంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయడంలో షరతులు విధిస్తుంటాయి. ఎన్నికల్లో చేసిన ఖర్చుకు మించి సంపాదిస్తుంటాయి. అయితే ఇందంలో వ్యూహాత్మకతను పాటించే రాజకీయ పార్టీకి మాత్రమే అధికారం దక్కుతుందని” ప్రశాంత్ కిషోర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

# జూబ్లీహిల్స్ అభివృద్ధికి నవీన్ యాదవ్‌కు మద్దతివ్వండి

### ప్రజా పాలనతో సంక్షేమం మరింత వేగం

**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 13:**



జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఇప్పటికే ప్రారంబమైన సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు వెళ్లాలంటే అధికార పార్టీకి బలమైన మద్దతు అవసరమని సూచించారు. జూబ్లీహిల్స్ ప్రాంతానికి ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఐక్యంగా నిలబడి అధికార బృందానికి విశ్వాసాన్ని అందించాలని నాయకత్వం కోరింది. ఆనంద్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఎర్రగడ్డ డివిజన్ నార్త్ ఇండియన్స్ వెల్ఫేర్ సొసైటీ సమావేశంలో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరి నవీన్ యాదవ్ అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, కాలనీల విస్తరణ, నీటి సమస్యల పరిష్కారం, రోడ్ల నిర్మాణం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని నాయకులు స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌ను మోడల్ నియోజకవర్గంగా మార్చే దిశగా అడుగులు వేస్తాం. అధికారంలో కొనసాగితే ప్రతి వర్ణం, ప్రతి వర్గం ప్రజలకు న్యాయం జరుగుతుంది” అని సభలో నాయకులు అన్నారు.

# ఆ ఇద్దరు మిస్

**చెన్నై, అక్టోబరు 13**
ప్రతీ ఏడాది 80S కాలానికి చెందిన హీరోలందరూ ఒక చోట రీ యూనియన్ అవ్వడం మనమంతా చూస్తూనే ఉన్నాం. ఈ రీ యూనియన్ లో మెగాస్టార్ చిరంజీవి,విక్టరీ వెంకటేష్, సురేష్, నరేష్, శరత్ కుమార్, భాను చందర్, తమిళ నటుడు ప్రభు, రాధ, మీనా, రమ్య కృష్ణ, మలయాళం నటుడు జయ రామ్, హిందీ నటుడు జాకీ ష్రాఫ్, కుష్బూ తదితరులు ఈ రీ యూనియన్ ప్రోగ్రాం లో రెగ్యులర్ గా పాల్గొంటూ ఉంటారు. అలా ఈ ఏడాది కూడా వీళ్ళు రీ యూనియన్ అయ్యారు. అందుకే సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. కాసేపటి క్రితమే దీని గురించి మెగాస్టార్ చిరంజీవి ట్విట్టర్ ద్వారా స్పందించాడు. ఆయన మాట్లాడుతూ 'నా ప్రియమైన మిత్రులతో కలిసి ప్రతీ ఏడాది నేను జరుపుకునే రీ యూనియన్ ప్రోగ్రాం నాకు ఎన్నో తీపి జ్ఞాపకాలను అందిస్తూ ఉంటుంది. ఎన్నిసార్లు మేము రీ యూనియన్ అయినా అది కొత్తగానే ఉంటుంది' అంటూ చెప్పుకొచ్చాడు.పైన చెప్పిన పేర్లలో మలయాళం నటుడు మోహన్ లాల్ పేరు మిస్ అయ్యింది. ప్రతీ ఏడాది ఆయన కూడా పాల్గొనేవాడు కానీ, ఈసారి ఎందుకో మిస్ అయ్యాడు. అదే విధంగా సీనియర్ హీరో సుమన్ కూడా ఈ ఏడాది మిస్ అయ్యాడు. అంతా బాగానే ఉంది కానీ, అక్కినేని నాగార్జున, నందమూరి బాలకృష్ణ వంటి వారు కూడా 80S కాలానికి చెందిన వాళ్ళే కదా, వీళ్లేందుకు ఈ రీ యూనియన్ ప్రోగ్రాం లో భాగం అవ్వరు అనే సందేహం అందరిలోనూ ఎప్పటి నుండో ఉంది. చిరంజీవి, బాలకృష్ణ లకు ఒకరంటే ఒకరు పడట్లేదు, అందులో ఎలాంటి సందేహం లేదు. రీసెంట్ గా అసెంబ్లీ సాక్షిగా నందమూరి బాలకృష్ణ చిరంజీవి పై చేసిన వ్యంగ్యాస్త్రాలు అందుకు ఒక ఉదాహరణ. చిరంజీవి కూడా చాలా ఘాటుగా రెస్పాన్స్ ఇచ్చాడు.ఒకప్పుడు బాలయ్య 80S రీ యూనియన్ ప్రోగ్రాం కి చిరంజీవి నన్ను పిలవలేదు అంటూ అసహనం కూడా వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. బాలయ్య కి, చిరంజీవి కి మధ్య పడట్లేదు కాబట్టి, ఈ ప్రోగ్రాం కి బాలయ్య రావట్లేదు అనుకుందాం, మరి అక్కినేని నాగార్జున చిరంజీవి కి సొంత సోదరుడితో సమానం కదా, ఆయనేందుకు ఈ కార్యక్రమం లో పాల్గొనడం లేదు?. ఎన్నో ఏళ్ళ నుండి ఈ రీ యూనియన్ కార్యక్రమం జరుగుతూ ఉంది, కానీ ఒక్కసారి కూడా నాగార్జున ఈ ప్రోగ్రాం లో పాల్గొనలేదు. దీని వెనుక ఉన్న కారణం ఏమిటి అనేది ప్రస్తుతానికి మిస్టరీ నే. వెంకటేష్ మరియు నాగార్జున మధ్య కోల్డ్ వార్ నడుస్తూ ఉంటుందని, అందుకే నాగార్జున ఈ ప్రోగ్రాం కి దూరంగా ఉంటాడని కొంతమంది అంటుంటారు, ఇందులో ఎంత మాత్రం నిజం ఉందో ఎవరికీ తెలియదు.

# సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు

**హైదరాబాద్, అక్టోబరు 13**
హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఎంత చెప్పినా తక్కువే. మెట్రో రన్ అవుతున్నా, ఎక్కడిక్కక్కడ ఫ్లైఓవర్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ చిక్కులు నగరవాసులకు తప్పడం లేదు. ముఖ్యంగా నార్త్ సిటీ వైపు పరిస్థితి మరింత హారిబుల్‌గా ఉంటుంది. అందుకే దీనికి పరిష్కారంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్యారడైజ్ కూడలి నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ రోజురోజుకు చాలా వేగంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణ కారణంగా శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. అందుకే దీని నుంచి ఉపశమనం కోసం మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించారు. కానీ అది ముందుకు కదలడం లేదు. అందుకే ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నార్త్‌సిటీపై ఎక్కువ ఫోకస్ చేశారు. ప్యారడైజ్ సర్కిలల్ నుంచి మేడ్చల్, సమీర్‌పేట వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఊహించని స్థాయిలో పెరిగింది. ఈ మార్గం కేలం నిత్యం ప్రయాణించే లోకల్ వాహనాలే కాకుండా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాణిజ్య వాహనాలకు కూడా ప్రధాన రహదారి. దీంతో సాధారణ ప్రయాణ సమయం అంచనాలకు మించి పెరుగుతోంది. ఈ మార్గంలో ఉదయం, సాయంత్ర వేళల్లో ట్రావెల్ చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ట్రాఫిక్ జామ్‌లు, వర్షాలు పడితే సమస్యలు మరింత రెట్టింపు అవుతున్నాయి.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేసిన చైర్మన్,వైస్ చైర్మన్

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 13**



రామన్నపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో రైతులకు మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా భుక్య నాయక్, వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి రైతులకు సోమవారం టార్పాలిన్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మార్కెట్ కు ధాన్యం తెచ్చిన ప్రతి రైతుకు టార్పాలిన్ పట్టాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీలో 1200 టార్పాన్లు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు అధికారులను సంప్రదించి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగోని వెంకటేశం, ఎండి జమీరుద్దీన్, గోదాసు పృథ్వీరాజ్, ఎండి అక్రమ్, కూనూరు కృష్ణ, సాల్వేర్ లింగం, , రవి, రాపోలు ఉపేందర్, కొండం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా భవాని ప్రత్యేక పూజల పట్టు వస్త్రాలు కలుశాన్ని సమ్మి గౌడ్ కి అందజేసిన అన్నదాత యూత్ అసోసియేషన్ కమిటీ



**తోవ్వ,కేసముద్రం, అక్టోబర్ 13:**

కేసముద్రం మండలం తాళ్ల పూసపల్లి గ్రామంలో అన్నదాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా భవాని మాతా దేవి ప్రత్యేక పూజల్లో తొమ్మిది రోజులపాటు ఉన్నటువంటి కలుశాన్ని,ప్రతిరోజు అమ్మవారి అలంకరణలో భాగంగా ఉన్న పట్టు వస్త్రాలను తాళ్లపూస పల్లి అన్నదాత యూత్ అసోసియేషన్ కమిటీ యువత సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ కి అందజేశారు.ఈ సందర్భంగాసమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.... ఆ దుర్గామాత తల్లి పూజలతో వర్ధిల్లిన పట్టు వస్త్రాలు,కలుశం అన్నదాత యూత్ అసోసియేషన్ కమిటీకి, నాకు అందేలా చేసిన దుర్గామాతకు, అసోసియేషన్ కమిటీ సభ్యులందరికీ నా తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కమలాకర్,రాజు, మధుకర్,నరేందర్, విక్రమ్,శివరామకృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

## ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ కి ఘనంగా సన్మానం:




**తొవ్వ,అక్టోబర్ 13.సంస్థాన్ నారాయణపూర్ :**

సంస్థాన్ నారాయణపురం మండలంలోని ప్రముఖ సేవా సంస్థ ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ నీ వావిల్లపల్లి గ్రామంలో, ప్రజలు మర్యాదపూర్వకంగా సన్మానం చేయడం జరిగింది. ఈ ఎల్ వి ఫౌండేషన్ చేస్తున్న సేవలు మరువలేనివి అని కొనియాడారు. పేద ప్రజలకు సేవలు అందిస్తున్న భాస్కర్ ప్రజానేత గా ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో కోల మహేష్, శ్రీరాముల రవి, పడసనబోయిన బుగ్గ రాములు,ఐతరాజు ప్రవీణ్, వరికుప్పల శ్రీను, వరికుప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టాలకై బార్ కౌన్సిల్ ఎన్నికల పోటీ చేస్తాం..

## లాయర్స్ పోరం అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి,




తొవ్వ,అక్టోబర్13, చౌటుప్పల్:

కూకట్పల్లి ప్రధాన కోర్టు ఆవరణలో సీనియర్ న్యాయవాదులు చంద్రశేఖర్ సురేష్ బాబులతో కలిసి తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అఖిలభారతీయ న్యాయవాద సంయుక్త ఆదిభక్త మంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి మాట్లాడుతూ లాయర్స్ పోరం పర్ సోషల్ జస్టిస్ మరియు అఖిలభారతీయ న్యాయవాద ఆదిభక్త మంచ్ సంస్థల నుంచి న్యాయవాదులకు రక్షణ చట్టాలు ఏర్పాటు చేయాలని, జూనియర్లకు 5000 ఉపకార వేతనాలు ఇవ్వాలని అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నాము రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ న్యాయవాద సంఘాలు న్యాయవాదుల మద్దతుతో పోరాటాలు నిర్వహిస్తూ ఉన్నాము ప్రత్యేకంగా న్యాయవాదులకు రక్షణ చట్టాల ఏర్పాటు చేయాలని ఏకైక లక్ష్యంతో బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం ప్రతి న్యాయవాది 25 ఓట్లు వేసే అవకాశం ఉంది కాబట్టి మొదటి ప్రాధాన్యత ఓటు నాకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే న్యాయవాదుల సమస్యలు పరిష్కరించడం కోసం కృషి చేస్తానని నర్రి స్వామి తెలియజేశారు కార్యక్రమంలో కూకట్పల్లి కోర్టు న్యాయవాదులు సురేష్ బాబు, చంద్రశేఖర్, మేడ్చల్ కోర్ట్ న్యాయవాదులు సురేందర్ బాబు, జూనియర్ న్యాయవాదులు నర్సింలు, అశోక్ , కృష్ణ చైతన్య తెలంగాణ సామాజిక చైతన్య వేదిక నాయకులు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# తడిచిన ప్రతి గింజను ప్రభుత్వం కోనుగోలు చేస్తుంది.


## ఎమ్మెల్యే వేముల వీరేశం

**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :అక్టోబర్ 13**

ఆకాల వర్షం కారణంగా రామన్నపేట మండలంలోని దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ గ్రామల్లో తడిచిన వరి ధాన్యాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఎంఆర్ఓ, ఎంపీడీవో అధికారులతో పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 సెంటీమీటర్ల వర్షం కారణంగా ధాన్యం తడిచింది.తడిచిన ధాన్యాన్ని తొందరగా కొనుగోలు చేస్తామని రైతులు అధైర్య పడవద్దని అన్నారు.ప్రభుత్వ పరంగా ధాన్యం కోనుగోల్లను వేగవంతం చేస్తాము.రానున్న రోజుల్లో వర్షాలు ఇంకా ఉన్నాయి కాబట్టి, రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# సైదాబాద్ జైల్ గార్డెన్లోని ప్రభుత్వ వీధి బాలుర గృహంలో ఆరుగురు చిన్నారులపై పర్యవేక్షకుడు లైంగిక దాడి



**తొవ్వ : 13 అక్టోబర్,ఎల్బీనగర్ ప్రతినిధి:**

సైదాబాద్ జైల్ గార్డెన్లోని ప్రభుత్వ వీధి బాలుర గృహంలో ఆరుగురు చిన్నారులపై పర్యవేక్షకుడు లైంగిక దాడివివరాల్లోకి వెళితే జువెనైల్ హోంలో ఆరుగురు చిన్నారులపై లైంగిక దాడి జరిగింది.బాధితుల్లోని ఓ బాలుడి తల్లి పోలీసులను ఆశ్రయించగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన.హైదరాబాద్ - సైదాబాద్ జైల్ గార్డెన్లోని ప్రభుత్వ వీధి బాలుర గృహంలో ఆరుగురు చిన్నారులపై పర్యవేక్షకుడు లైంగిక దాడి చేసాడు.అనుమతి లేకుండా బాలుడిని ఇంటికి పంపించిన స్టాఫ్ గార్డ్.దసరా పండగకి ఇంటికి వచ్చి తిరిగి జువెనైల్ హోంకు వెళ్లనని తల్లి వద్ద భోరున విలపించిన ఓ చిన్నారి.బాలసదన్‌లోని పిల్లలకి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు.మొదట బాధితుడు ఒక్కడే అనుకున్నా.. విచారణలో మరో అయిదుగురిపైన లైంగిక దాడి చేసినట్లు గుర్తించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

## ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి జిల్లా: వలిగొండ తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 13:**



వలిగొండ మండలం నాగారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో, వలిగొండ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులతో పరిశీలించారు. సోమవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిందని,గతంలో ఎన్నడు లేని విదంగా 12 సెం.మీ వర్షం కురిసిందని అన్నారు.తడిసిన వరి ధాన్యాన్ని ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే తెలిపారు.రైతులు వడ్లను ఎత్తైన ప్రదేశంలో పోసుకోవాలన్నారు.రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించి ధాన్యం తడవకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం

**యాదాద్రి జిల్లా :వలిగొండ బీ తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 13**

రామన్నపేట ప్రాజెక్టు వలిగొండ మండలం వెలువర్తి సెక్టార్ గోపరాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు సీమంతం, మూడు సంవత్సరముల పిల్లలకు అక్షరాభ్యాసం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. సూపర్వైజర్ బాలమణి తల్లులను ఉద్దేశించి పోషకాహారం గురించి వివరించారు. ఆకుకూరలు పండ్లు కూరగాయలు పప్పు ధాన్యాలు నువ్వులు బెల్లం వంటివి రోజువారి ఆహారంలో చేర్చుకోవాలని చక్కెర, నూనె వాడకాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్ సలిగంజి మణెమ్మ ,పంచాయతీ సెక్రటరీ నవనీత, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఆశా వర్కర్ నీరజ, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

## మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్



**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 13బీ**
రామన్నపేట మండలంలో రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్లో అరాపోసిన వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయాయి. ఒక్క రైతు ఐదు నుంచి పది క్వింటాల వరకు వడ్లు నష్టపోయరు. ప్రభుత్వం వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.పత్తి పంటలు నేలమట్టకావడం వల్ల రైతులు తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రతి నష్టపోయిన రైతుకు ప్రభుత్వం ?50,000 ఆర్థిక సాయం అందించాలి.రైతులకు వెంటనే ?10,000 తాత్కాలిక సాయం ఇవ్వాలి.అధిక వర్షాల కారణంగా పాడైన పచ్చిధాన్యాన్ని ప్రభుత్వం క్వింటాలుకు ?2,390 చొప్పున కొనుగోలు చేయాలి.ప్రతి రైతుకు తార్పాలిన్ సదుపాయం తక్షణమే ప్రభుత్వం అందుబాటులో ఉంచాలి.మండల వ్యాప్తంగా అధికారుల ద్వారా తక్షణ సర్వే నిర్వహించాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ నాంపల్లి లింగయ్య, గ్రామ కార్యదర్శి నరసింహ, నాయకులు కర్రె శ్రీనివాసులు, దండిగా నాగరాజు, మాదాసు రమేష్, దండిగ రమేష్, కళ్లెం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ముదిరెడ్డి వెంకట్ రెడ్డి ని పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి



**తొవ్వ,కేసముద్రం, అక్టోబర్ 13:**
కేసముద్రం మున్సిపాలిటీ విలేజ్ కేసముద్రం గ్రామానికి చెందిన ముదిరెడ్డి వెంకట్ రెడ్డి తల్లి ముదిరెడ్డి నరసమ్మ అనారోగ్యంతో మృతిచెందగా నేడు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,వారితోపాటు మండల నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి,గ్రామ పార్టీ అధ్యక్షులు పోలేపల్లి వెంకట్ రెడ్డి,గోపాల్ రెడ్డి,సంకేపెల్లి శ్రీనివాస్ రెడ్డి,పోకల శ్రీనివాస్,ముదిరెడ్డి రగోతం రెడ్డి, తదితరులు ఉన్నారు.

# మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి.

## తడిసిన మొక్కజొన్నలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

### –న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య.




బయ్యారం,తొవ్వ,అక్టోబర్ 13.
మొక్కజొన్న పంట గత నెలరోజులుగా మార్కెట్లోకి వస్తున్నా ఇంతవరకు మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని,దీని వలన ప్రయివేటు వ్యాపారులు క్వింటాలుకు 15,16వందలకు మించి కొనుగోలు చేయటం లేదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు.సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బయ్యారంలో బైక్ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ధర్నానుద్దేశించి గౌని ఐలయ్య ప్రసంగిస్తూ త్వరలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలు నీటిమూటలయ్యాయని అన్నారు.రోడ్లపై,కళ్ళాల్లో మొక్కజొన్నలు ఆరబోసుకొని ఎదురు చూస్తున్న రైతులు అకాల వర్షాల కారణంగా పంట తడిసి ఆగమాలు తున్నారని అన్నారు.పంట రక్షణకు కనీసం టార్పాలిన్ పట్టాలను కూడా ప్రభుత్వం సరఫరా చేయటం లేదని ఆయన విమర్శించారు.ఒకవైపు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడి ఏజన్సీలో మొక్కజొన్న ప్రధాన పంటగా సాగు చేస్తున్నారని, అనేక ఇబ్బందులను ఎదుర్కొని మొక్కజొన్న పండించిన రైతులు ప్రయివేటు వ్యాపారుల దోపిడీకి గురై దారుణంగా నష్ట పోతున్నారని ఆయన అన్నారు.రాష్ట్రంలో 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయిందని, సగటున ఎకరాకు 18.50 క్వింటల్ దిగుబడి వచ్చి,మొత్తం 11.56 లక్షల టన్నుల దిగుబడి అవుతుందని,ఈ పంటను ప్రభుత్వం నిర్ణయించిన కనీసం మద్దతు ధర క్వింటాకు 2400కు వెంటనే కొనుగోలు చేయాలని ఐలయ్య డిమాండ్ చేశారు.ఇప్పటికైనా వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిసిన వాటితో సహా మొత్తం మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని లేనిపక్షంలో జిల్లా స్థాయిలో ఆందోళనకు పూనుకొంటామని ఐలయ్య హెచ్చరించారు.అనంతరం తహశీల్దార్ నాగరాజుకి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మోకాళ్ళ మురళీ కృష్ణ,నాయకులు రామగిరి బిక్షం,పూనెం బిక్షం,బాబోయ్ నర్సింహా,రామచంద్రపురం నాగేశ్వరరావు,మేకపోతుల నాగేశ్వరరావు,పూనెం లింగన్న,సూర్నపాక రాంబాబు,పూనెం వెంకటేశ్వర్లు,ఏపూరి వీరభద్రం,కొదుమూరి నాగేశ్వరరావు,రాము,శోభన్ తదితరులు పాల్గొన్నారు..

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

## ఈ ఎల్ వి ఫౌండేషన్ డా. భాస్కర్



**తొవ్వ, అక్టోబర్ 13 సంస్థాన్ నారాయణపూర్:**
సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని జనగాం గ్రామానికి చెందిన ఓర్సు దశరథ,కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఈ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ డా. భాస్కర్ తక్షణ సహాయంగా ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు.ఈ నేపద్యం లో నేడు మృతుని కుమార్తె గంగోత్రి భవిష్యత్తు కోసం ప్రతి నెల 3000/%-% వేల రూపాయలు పోస్ట్ ఆఫీస్ నందు డిపాజిట్ చేయనున్నారు.మరియు అమ్మాయి భవిష్యత్తు కు పూర్తి బాధ్యత తనదేనని ఈ ఎల్ ఈ ఫౌండేషన్ డాక్టర్ భాస్కర్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పి ఎల్ వి ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్,శంకర్,కిరణ్,విజయ్,సునీల్, కోలమహేష్, బాలకృష్ణ,ముత్యాలు,గ్రామస్తులు ,తదితరులు, పాల్గొన్నారు

# ఆదివాసీ యువకుడికి వ్యాయమ విద్యలో డాక్టరేట్ ప్రధానం.

**బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 13.**




బయ్యారం మండల కేంద్రానికి చెందిన ఈసం లక్మి నర్సయ్య,పూలమ్మ దంపతుల కుమారుడు ఈసం నాగేష్ తమిళనాడు అన్నామలై యూనివర్సిటీ లో రెగ్యులర్ పి హెచ్ డి డిగ్రీ నీ డా.కే.శివ కుమార్ ప్రొఫెసర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 'ఎఫెక్ట్ ఆఫ్ సక్ అండ్ ఏరోబిక్ ఇంటర్వెల్ ట్రైనింగ్ ఆన్ సెలెక్టెడ్ స్పీడ్ అండ్ ఎండ్యురెన్స్ పారామీటర్స్ అమాంగ్ స్టేట్ లెవెల్ ఖో- ఖో ప్లేయర్స్' అనే టాపిక్ పై చేసిన పరిశోధనకు గాను ఇండియన్ ఎగ్జామినర్ డా.ఎన్.మురళిరాజన్ ప్రొఫెసర్,అలగప్ప యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేశారు.ఈ యొక్క డాక్టరేట్ పట్టా సాధించడానికి తన కుటుంబ సభ్యులే ప్రధానమైన కారకులనీ,అలాగే విద్యా నేర్పించిన గురువులు, స్నేహితుల మద్దతు వల్లనే డాక్టరేట్ సాధించడం జరిగిందనీ ఈసం నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# నీటిపారుదల అధికారులతో సమీక్ష నిర్వహించిన

## ఎమ్మెల్యే మురళి నాయక్



**తొవ్వ ,మహబూబాబాద్ , అక్టోబర్ 13:**
నీటిపారుదల శాఖపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు . సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు రేవంత్ సర్కార్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలనీ .గతంలో నిర్మించిన కెనాల్ లో డిబిఎం కెనాల్ పూడికతో నిండి చెట్ల పొదల ముళ్ళ పోదలతో నిండిపోయి డిబిఎమ్ కెనాల్ ద్వారా నీరు వెళ్లకుండా ఇబ్బందులకు గురవుతుందని ఇకనుండి కెనాల్ లో పూడిక నిలువలు ఉండకుండా చూడాలనిఆదేశించారు ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఎస్సీ రామకృష్ణ,ఈఈ వీరస్వామి, ఈఈ అప్పయ్య, ఏ ఈ ఈ శ్రావణి పాల్గొన్నారు...

# ఆకేరులో అక్రమ ఇసుక రావాణా ...

## భారీ వర్షాలను లెక్క చేయని ఇసుకాసురులు

## నిద్రాణంలో అధికారులు ...

**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 09:**
ఆకేరు వాగులో ఇసుకాసురులు ఇష్టానుసారంగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు , భారీ వర్షలను లెక్కచేయకుండా జేసీబీ లు ట్రాక్టర్లతో తొవ్వి తోడేస్తున్నారు ,రెవిన్యూ అధికారులు పోలీసులు అక్రమ ఇసుక ను కట్టడి చేయడంలో విఫలమయ్యారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు , ఆదివారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ముంగిమడుగు వద్ద ఆకేరువాగులో ఏరు వస్తున్న, వర్షం కురుస్తున్న లెక్కచేయకుండా, నిరంతరాయంగా కొనసాగుతున్న ఇసుక రవాణ వాగులోనుంచి ఒక ట్రాక్టర్ తో మరో ట్రాక్టర్ కు తాళ్లు కట్టి లాగు తుండగా ఓ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలు తృటిలో తప్పించుకున్న డ్రైవర్.. ప్రాణాలతో బయటపడినారు ,పరుగులు పెడుతున్న ఇసుక ట్రాక్టర్ లు..., ప్రమాదపు అంచున ప్రాణాలు.మీద ఆయా గ్రామాల ప్రజలు బతుకుతున్నారు ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు ,

